రేపు జాషువా వర్ధంతి సభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా వర్ధంతి సభను ఈనెల 24వ తేదీన నగరంలోని కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖపట్నానికి చెందిన కవి డాక్టర్ బండి సత్యనారాయణతో పాటు జిల్లాకు చెందిన ప్రముఖ కవులు, అధ్యాపకులు పాల్గొనున్నారు. వర్ధంతి సభ ఆ రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నారు. కవులు, కథా రచయితలు, సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రతినిధులు కోరారు.

తప్పుల తడక

- బంగారు కుటుంబాల సర్వే తీరు
- కొన్నిచోట్ల జాబితాలో సంపన్నులకు చోటు
- మరోసారి సర్వే చేయాలని నిర్ణయం
- వచ్చే నెల ఆగస్టు ఐదో తేదీ వరకు గ్రామసభలు
- మరోవైపు మార్గదర్శుల అన్వేషణలో అధికారులు

పేదలను ఆదుకునేందుకు అంటూ టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పి-4 విధానంలో గందరగోళం నెలకొంది. బంగారు కుటుంబాలు-మార్గదర్శులు అనే పేరుతో నిర్వహించిన సర్వే తప్పుల తడకగా ఉన్నట్లు అధికారులు తాజాగా గుర్తించారు. బంగారు కుటుంబాల దత్తత తీసుకునే క్రమంలో చాలాచోట్ల పేదల స్థానంలో సంపన్నులకు చోటు దక్కినట్లు తెలుస్తోంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం మరోసారి సర్వే చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం గ్రామాల్లో సభలు నిర్వహించి నిరుపేదలు ఎవరో నిర్ధారించాలని సూచించింది. బంగారు కుటుంబాలను తేల్చేందుకు వచ్చే నెల ఐదో తేదీ వరకు గ్రామసభలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. మరోవైపు పాత జాబితాలోని అసలైన నిరుపేదలకు చేయూత అందించేందుకు మార్గదర్శులను అన్వేషించే పనిలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు నిమగ్నమయ్యారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పబ్లిక్ ప్రైవేట్, పీపుల్ పార్టనర్ షిప్ (పి-4) విధానాన్ని తెరపైకి తెచ్చింది. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం నిరుపేద కుటుంబాలను మొదటి 20 శాతం సంపన్న కుటుంబాలు ఆదుకునే లక్ష్యంతో తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం ఈ ఏడాది మార్చి ఎనిమిది నుంచి 18వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సర్వే చేపట్టారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించారు. ఆవిధంగా జిల్లాలో 75,566 కుటుంబాలు ఉన్నట్లు తేల్చారు. అందులో 2,11,586 సభ్యులు ఉన్నట్లు గుర్తించారు. నియోజకవర్గాల వారీగా కుటుంబాలను గుర్తించి, వారిని ఆదుకునేందుకు మార్గదర్శులను అన్వేషించడం మొదలుపెట్టారు. ఇప్పటివరకు మొత్తం 181 బంగారు కుటుంబాలకు సాయపడేందుకు 37 మంది మార్గదర్శులు మాత్రమే వచ్చారు.

నియోజకవర్గాల వారీగా పరిస్థితి ఇలా...

ప్రభుత్వం గుర్తించిన బంగారు కుటుంబాల్లో నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే పాతపట్నంలో 11,572 బంగారు కుటుంబాలు ఉన్నాయి. వారిలో 55 కుటుంబాలను ఆదుకోవడానికి ఏడుగురు వచ్చారు. ఎచ్చెర్లలో 11,024 కుటుంబాలు ఉండగా, ఐదు కుటుంబాలకు సాయం చేసేందుకు ఇద్దరు మార్గదర్శులు మాత్రమే వచ్చారు. శ్రీకాకుళంలో 10,324 కుటుంబాలు గుర్తించగా, వారిలో నాలుగు కుటుంబాలను ఆదుకునేందుకు ఇద్దరు ముందుకొచ్చారు. ఇచ్ఛాపురంలో 9,659 బంగారు కుటుంబాలు గుర్తించగా, 38 కుటుంబాలను ఆదుకునేందుకు 14 మంది ముందుకొచ్చారు. టెక్కలిలో 9,541 బంగారు కుటుంబాలు గుర్తించగా, ఏడు కుటుంబాలను ఆదుకునేందుకు ఐదుగురు వచ్చారు. ఆమదాలవలసలో 9,023 కుటుంబాలను గుర్తించగా, ఎనిమిది కుటుంబాలను ఆదుకోవడానికి ఆరుగురు మార్గదర్శులు వచ్చారు. నరసన్నపేటలో 7,745 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఆరు కుటుంబాలకు చేయూత ఇచ్చేందుకు ఐదుగురు వచ్చారు. పలాసలో 6,678 కుటుంబాలను గుర్తించగా, వారిలో ఆరు కుటుంబాలకు చేదోడుగా ఉండేందుకు ఐదుగురు మార్గదర్శులు వచ్చారు.

అసమగ్ర సర్వే

బంగారు కుటుంబాల సర్వే అసమగ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సర్వే చేసే విధానం, అనుసరించాల్సిన పద్ధతులు, పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై సచివాలయ సిబ్బందికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే శిక్షణ ఇచ్చారు. సర్వేలో గుర్తించిన అంశాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వే ద్వారా సంక్షేమ పథకాలు పోతాయనే భయంతో వివరాలు దాచిపెడితే సర్వే సిబ్బంది తాము స్వయంగా చూసి పరిశీలించిన అంశాలను అందులో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. సర్వే సందర్భంగా ఇంట్లో టివి లేదని చెప్తే, సిబ్బందికి దాని శబ్దం వినిపిస్తే ఉందని నమోదు చేయాలని చెప్పింది. తమ ఇంటికి కరెంట్ కనెక్షన్ లేదని చెప్తే ఇంట్లో ఫ్యాన్ తిరుగుతుంటే, ఆ సౌకర్యం ఉందని నమోదు చేయాలని సూచించింది. సచివాలయ సిబ్బంది వీటిని పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ నుంచి వచ్చిన డేటా ఆధారంగా చాలాచోట్ల సిబ్బంది ఫోన్‌లోనే వివరాలు తీసుకుని నమోదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో సర్వే తప్పుల తడకగా మారింది. నిరుపేదల స్థానంలో కొంత సంపన్నులకూ చోటు దక్కింది.

వచ్చే నెల ఐదో తేదీ వరకు గ్రామసభలు

పి-4 సర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలను సరిదిద్దడానికి ప్రభుత్వం గ్రామాల్లో సభలు నిర్వహించాలని నిర్ణయించింది. అందులో అర్హులను గుర్తించి, బంగారు కుటుంబాల అసలు సంఖ్యను తేల్చనున్నారు. వచ్చే నెల ఐదో తేదీ వరకు గ్రామసభలను నిర్వహించనున్నారు. అప్పటివరకు ప్రస్తుతం గుర్తించిన కుటుంబాల్లో పేదలకు సాయం అందించేలా మార్గదర్శులను అన్వేషించనున్నారు. ప్రభుత్వం పి-4 లక్ష్యాలు చేరుకోవడంపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తోంది. దీంతో జిల్లాలో బంగారు కుటుంబాలు-మార్గదర్శుల కార్యక్రమాన్ని వేగవంతం చేయడంపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. అన్ని ప్రభుత్వ శాఖలకూ లక్ష్యాలను నిర్దేశించింది. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శులను గుర్తించే పనిలో అధికార యంత్రాంగం తీవ్రంగా తలమునకలైంది.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పారిశుధ్యంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

- అధికారులే బాధ్యత వహించాలి
- మండల స్థాయి నుంచి సమన్వయం తప్పనిసరి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మండల స్థాయి అధికారులు, సిబ్బందితో జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయం చేసుకుని పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎంపిడిఒలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత వంటి అంశాల్లో ఎంపిడిఒలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గార, హిరమండలం ఎంపిడిఒలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజన్ కాబట్టి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పరిశుభ్రత పనులు సక్రమంగా లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

పిఆర్‌జిఎస్, కోర్టు కేసులు, ఎరువుల పంపిణీ, పి-4 సర్వే పురోగతి వంటి అంశాలపై సమీక్ష చేసిన ఆయన, ప్రజా సమస్యల పరిష్కారం ఫాస్ట్‌ట్రాక్‌లో ఉండాలన్నారు. కోర్టు కేసులపై సకాలంలో స్పందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి సానుకూల దృక్పథం ఉండేలా ప్రతి స్థాయిలోనూ సమీక్ష చేయాలన్నారు. ముఖ్యంగా నీటి నాణ్యత పరీక్షలు, కాలువల శుభ్రత, హాస్టళ్ల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. పరిశుభ్రతను నిర్లక్ష్యం చేస్తే అధికారులు స్వయంగా బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఎరువుల కొరత ఉండకూడదు

ఎరువుల పంపిణీలో అలసత్వం పనికిరాదని, కొరత అనే పదం వినిపించకూడదని స్పష్టం చేశారు. ఎరువుల సరఫరాపై రోజూ వారీ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద తుప్పల తొలగింపు, రోడ్ల పక్కన మొక్కల నాటకం వంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పి-4 సర్వే నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, బంగారు కుటుంబాలను యాప్‌లో నమోదు చేయడం, మార్గదర్శుల గుర్తింపు ఈ నెలాఖరుకు పూర్తి కావాల్సి ఉందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, పలు శాఖల అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు భారీ జరిమానాలు

శ్రీకాకుళం : నగరంలోని గుజరాతీపేట మెయిన్ రోడ్డులోని ముత్యాలమ్మ మార్కెట్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ బి.వి.డి ప్రసాదరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మంగళవారం పర్యటించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా షాపులను క్రమబద్ధంగా అమర్చుకోవాలని సూచించారు. ఆదేశాలను బేఖాతరు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. మార్కెట్ పరిధిలోని ప్రతి విక్రయదారుడు నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే భారీ జరిమానాలతో పాటు ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- ప్రార్థనా మందిరాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటు తప్పనిసరి
- పెండింగ్ వారెంట్లు త్వరితగతిన అమలు చేయాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నేర నియంత్రణ చర్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, మాదకద్రవ్యాల నియంత్రణ, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, సిసి కెమెరాల ఏర్పాటు, విజిబుల్ పోలీసింగ్, కార్డాన్‌సెర్చ్ సోదాలు తదితర అంశాలపై డిఎస్‌పిలు, సిఐలతో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు, చర్చిలు, మసీదులు వంటి ప్రార్థనా మందిరాల వద్ద నిర్వాహకులు, కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో సిసి కెమెరాల ఏర్పాటు చేయించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ పరిష్కారం కార్యక్రమంలో స్వీకరించి ప్రతి ఫిర్యాదులను త్వరితగతిన విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. మహిళలు, ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు త్వరగా అమలుచేయాలన్నారు. ప్రతిరోజూ ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ భాగంగా కళాశాల, పాఠశాలల పరిధిలో ఎటువంటి ఈవ్‌టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల తనిఖీలు చేపట్టి గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే రౌడీషీట్స్ కలిగిన వారికి సత్ప్రవర్తనతో, చట్టాన్ని గౌరవిస్తూ జీవించాలని, నేర ప్రవృత్తిని విడనాడాలని కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్డాన్‌సెర్చ్ నిర్వహించి గంజాయి, మద్యం అక్రమ రవాణా నిల్వలపై సోదాలు చేయాలని తెలిపారు. పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై, పలు క్రిమినల్ కేసుల్లో అరెస్టు అయిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఇసుక అక్రమ ర్యాంపును నిలిపివేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడ వద్ద నిర్వహిస్తున్న ఇసుక అక్రమ ర్యాంపును వెంటనే నిలిపివేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తవలస, నిమ్మతొర్లాడలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపులను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్, పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దాడపేట వద్ద మంజూరైన ఇసుక ర్యాంపును కొత్తవలస, నిమ్మతొర్లాడ వరకు విస్తరించి పగలు, రాత్రి తేడా లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారని విమర్శించారు. సమీప గ్రామాల ప్రజలు ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామాలపై పడి గూండాయిజం చేస్తూ అరాచక పాలన కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. ఇసుక ర్యాంపును మంత్రి లోకేష్ నిర్వహిస్తున్నారన్న ప్రచారం సాగుతోందని, దీనికి సమాధానం ఆయనే చెప్పాలన్నారు. నాగావళి నది నుంచి ఆమదాలవలస మున్సిపాల్టీకి తాగునీరు సరఫరా జరుగుతోందని, ఇలాగే ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగిస్తే భవిష్యత్‌లో మున్సిపాల్టీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పవన్నారు. నదిలోని పచ్చికబయళ్లు, శ్మశానవాటికలనూ విడిచిపెట్టకుండా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారని విమర్శించారు. ఈ ఇసుక ర్యాంపులను కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇసుక ర్యాంపుల్లో నిబంధనలు పట్టించుకోకుండా, ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ప్రకృతి వనరులను అడ్డంగా దోచుకుంటూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. అధికారులూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైసిపి నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సురవరపు నాగేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ ర్యాంపును పరిశీలిస్తున్న కృష్ణదాస్ తదితరులు

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి - సోంపేట

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. రూ.3.50 లక్షలతో శారదాపురం బస్సు షెల్టర్‌కు, ఉప్పరపేటలో రూ.11.55 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి, రూ.3.50 లక్షలతో కటియా కొర్రయిపేట కూడలి వద్ద బస్ షెల్టరు, రూ.13 లక్షలతో ఎస్‌సి వీధి నుంచి శ్రీనిమ్మాసిని అమ్మ వారి ఆలయం వరకు సిసి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాకన్నపురం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో పరిపాలన కొనసాగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రం విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయన్నారు. రానున్న కాలంలో అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చిరునామా కానుందని చెప్పారు. విపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, ఎఎంసి చైర్‌పర్సన్ మద్దిల విజయలక్ష్మి, సర్పంచ్ నాగేశ్వరరావు, బతకల జోగారావు, బతకల దీర్ఘారావు, టిడిపి మండల అధ్యక్షులు మడ్డు కుమార్, రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, ఉలాల హరికృష్ణ, మల్లా కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

విద్యార్థులతో పాఠ్యాంశాలపై ముచ్చటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సర్వేలో పారదర్శకత అవసరం

ప్రజాశక్తి - గార

పి-4 సర్వేలో కచ్చితత్వం, పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గార మండలంలోని గార గ్రామంలో పి-4 యాప్ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. యాప్ ద్వారా కుటుంబాల సమాచార సేకరణ విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో పలు బంగారు కుటుంబాలను సందర్శించి, వారికి అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం కొత్తూరు సైరిగాం ఎంపియు పాఠశాలను సందర్శించారు. ఐదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి, చదువుకు సంబంధించిన పలు అంశాలను ప్రశ్నించారు. విద్యార్థుల హోం వర్క్ పుస్తకాలు, తరగతి పుస్తకాలను పరిశీలించి బోధనా ప్రమాణాలను తెలుసుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే విధంగా బోధనా పద్ధతులను అవలంభించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు సమాధానాలు చెప్పిన తీరును ప్రశంసించారు. పాఠశాల భవనం, తాగునీటి సౌకర్యాలు, మిడ్‌డే మీల్ వంటగది, మరుగుదొడ్ల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా ట్రాఫిక్‌కు పరిష్కారం

ప్రజాశక్తి - పలాస

అందరినీ ఒప్పించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పోలీసులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో డిఎస్‌పి వి.వెంకట అప్పారావు మంగళవారం అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిరీష మాట్లాడుతూ జిల్లాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టడం సరైన నిర్ణయమేనన్నారు. ప్రజలు, వాహనదారులు, రవాణా సంస్థలను ఒప్పించి అందరి ఆమోదంతో ఆంక్షలు విధించాలని సూచించారు. కాశీబుగ్గ బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండ్‌ను షాపింగ్ కాంప్లెక్స్‌గా తయారు చేయడాన్ని తప్పుపట్టారు. దాతల సాయంతో ప్రయాణికులకు తగు వసతులు కల్పించాలని కోరారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు పెట్టాలన్నారు. అత్యవసర రవాణాను ఇందులో మినహాయించాలన్నారు. అనేక విద్యాసంస్థలు ఈ ప్రాంతంలో ఉన్నాయని, భారీ వాహనాల వల్ల ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. టోల్ గేట్‌ను తప్పించుకోవడానికి పాత జాతీయ రహదారి మీదుగా వాహనాలు వస్తున్నాయని, దీనిపై దృష్టిసారించాలన్నారు. సమావేశంలో గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాసరావు, ఎస్.నవీన్‌తో పాటు పలు సంస్థల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ట్రాఫిక్ ఆంక్షలను డిఎస్‌పి వివరించారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆంక్షలు విధిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే అపరాధ రుసుము విధిస్తామన్నారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, సిఐ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

మాజీ మంత్రి అప్పలరాజుపై ఎమ్మెల్యే ఫైర్

నిజాయతీగా పనిచేస్తున్న తనపై, తన భర్త వెంకన్న చౌదరిపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు బురద జల్లుతున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష మండిపడ్డారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో లారీలకు వారు వ్యక్తిగతంగా నంబర్లు వేసుకుంటే కలెక్షన్ల కోసం వేశారని ప్రచారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేస్తున్నారని మండిపడ్డారు. పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి వి.వెంకటఅప్పారావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాజన్న టీమ్ పేరుతో ఐదేళ్లపాటు అసత్య ప్రచారాలు చేశారని, కూటమి ప్రభుత్వంలోనూ అదే విధానం కొనసాగిస్తామంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనార్దనరావు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు అన్నారు. పట్టణంలోని జన విజ్ఞాన వేదిక సభ్యత్వ క్యాంపెయిన్‌లో భాగంగా మున్సిపల్ ఉన్నత పాఠశాల లక్ష్మీనగర్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి.రమణమ్మ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని కలిగి ఉండి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. జెవివి నాయకులు హెచ్.వి. సత్యనారాయణ మాట్లాడుతూ మానవుడు అంతరిక్షంలో ఆవాసాలు ఏర్పరచుకొని శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిహెచ్.వి.ఎస్.మూర్తి, జెవివి నాయకులు బెండి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పి.సౌజన్య, ఎల్.యశశ్రీ, పి.లక్ష్మి, ఎల్.రాజ్యలక్ష్మి, ఎల్.నిర్మల, కె.శాంతి పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలకు చెందిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. 6,972 మంది రెగ్యులర్ విధానంలో ఈ పరీక్షలకు హాజరయ్యారు. 4,837 మంది సప్లిమెంటరీ విద్యార్థులు ఈ పరీక్షలు రాయగా, 55.53 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని వర్సిటీ పరీక్షల యుజి డీన్ డాక్టర్ జి.పద్మారావు తెలిపారు. ఈ పరీక్షలు జిల్లాలోని 53 కేంద్రాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి 21 వరకు నిర్వహించామని తెలిపారు.

రామకృష్ణకు డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణ

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జియుకెటి), జిల్లా పరిపాలనా అధికారి ముని రామకృష్ణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) తిరుపతి నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో నెట్‌వర్క్ ఎకనామిక్స్ - భాగస్వామ్య ఆధారిత సామాజిక అభ్యాస మార్కెట్లలో ధరల విధానాలు అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ పరిశోధనను డాక్టర్ కె.పి.నవీన్ పర్యవేక్షణలో పూర్తిచేశారు. రామకృష్ణ బిటెక్‌ను ఆంధ్రా విశ్వవిద్యాలయంలో, ఎంఫిల్ని ఐఐటి ఖడగ్‌పూర్‌లో పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన ఆర్‌జియుకెటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, పరిపాలనా అధికారిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్‌జియుకెటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.డి.జి.బాలాజీ, అకడెమిక్ డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, డీన్ వెల్ఫేర్ రవి, మోహన్‌కృష్ణ చౌదరి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది రామకృష్ణకు తెలియజేశారు.

'నవోదయ' పిలుస్తోంది..

- ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్
- ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం
- ఈనెల 29 వరకు అప్లికేషన్లకు గడువు
- డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - రణస్థలం

జవహర్ నవోదయ విద్యాలయ (జెఎన్‌వి)లో ప్రవేశాలకు పిలుపొచ్చింది. వచ్చే 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. గ్రామీణ విద్యార్థులకు మంచి ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించడంతో పాటు జాతీయ భావం, జాతీయ సమైక్యతకు కృషి చేయాలనే ఆశయాలతో జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటైంది. ఇక్కడ 6 నుంచి 12వ తరగతి వరకు సిబిఎస్‌ఇ విద్యతో పాటు హాస్టల్ వసతి సౌకర్యంను కల్పిస్తున్నారు. జిల్లాకు సంబంధించి సరుబుజ్జిలి మండల పరిధిలోని వెన్నెలవలసలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇక్కడ సీటు రావాలని కలలు కంటారు. వంద మార్కులకు దాదాపు 80 మార్కులు పైబడి సాధిస్తేనే సీటు వచ్చే అవకాశం ఉంటుంది. తాజాగా నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నవోదయ విద్యాలయం ప్రవేశ నిబంధనలు, దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష విధానం, అక్కడ లభిస్తున్న సదుపాయాలు వసతులు తదితర అంశాలను ఒకసారి పరిశీలిద్దాం...

2026-27 ఏడాదికి సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహణకు అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. https://cbseitms.rcil. gov.in/ nvs వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తులను మాత్రమే నవోదయ విద్యాలయ సమితి అనుమతిస్తారు. దీనికి ఆఫ్‌లైన్ విధానమనేది లేదు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల ఈ 29 వరకు గడువు విధించారు. డిసెంబరు 13న జెఎన్‌వి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

ఐదో తరగతి చదువుతున్నవారు అర్హులు

జెఎన్‌విలో ఆరో తరగతిలో 80 సీట్లు ఉండగా, 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 7.5 శాతం, బాలికలకు 1/3 శాతం, దివ్యాంగులకు మూడు శాతం రిజర్వేషన్ కల్పించారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వరుసగా 3, 4 తరగతి చదివి.. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అలాగే విద్యార్థులు 2021-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ఉమ్మడి జిల్లాలో చదువుతూ 2014 మే, ఒకటి నుంచి 2016 జూలై 31 మధ్యలో జన్మించి ఉండాలి.

వసతులు, సౌకర్యాల కల్పన భేష్

జిల్లాలోని సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని వసతులు, సౌకర్యాలు మెండుగా ఉన్నాయి. ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక క్వార్టర్స్ నిర్మించారు. విద్యాలయం ఆవరణలో క్రీడల కోసం ప్రత్యేకంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. ఆటపాటలు, యోగా వంటివి నిర్వహిస్తుంటారు. విద్యార్థులకు వ్యాయామశాలలు ఉన్నాయి. స్మార్ట్ తరగతులను కొనసాగిస్తున్నారు. సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం వంటి సౌకర్యాలు ఉన్నాయి.

ప్రణాళికతో చదివితే సీటు గ్యారంటీ

ఆరో తరగతిలో 80 సీట్లను నింపుతారు. ఇందుకు ప్రవేశపరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

కేంద్ర జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను స్థాపించింది. ఆరో తరగతి మొదలుకుని 12వ తరగతి వరకు కొనసాగిస్తారు. ఏడు ప్రాంతీయ భాషల్లో, మాతృభాషల్లో బోధన ఉంటుంది. పదో తరగతి వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఇ)ను అమలు చేస్తారు. సమయం కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదివితే సీటు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. మొత్తం 80 ప్రశ్నలకు వంద మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

ఇందులో మెంటల్ ఎబిలిటీ నుంచి 40 ప్రశ్నలు–50 మార్కులు, అర్థమెటిక్ నుంచి 20 ప్రశ్నలు–25 మార్కులు, లాంగ్వేజ్ నుంచి 20 ప్రశ్నలు–25 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో పరీక్ష జరుగుతుంది. మాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ఐదో తరగతి వరకు పాఠాలపై పూర్తిగా అవగాహన పెంచుకుని, పూర్వపు జెఎన్‌వి పరీక్ష పేపర్లను, పాత మోడల్ పేపర్లను పూర్తిగా సన్నద్ధం చేయగలిగితే మంచి మార్కులు సాధనకు అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

శ్రీకాకుళం సిటీ : చెవిలో పువ్వులతో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన నగరంలోని ఏడో రోజు సమ్మె కొనసాగింది. సమ్మెలో భాగంగా నగర పాలక సంస్థ కార్యాలయం ముందు మంగళవారం చెవిలో పువ్వులతో, మోకాళ్లపై నిల్చొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఆలసత్వం వహిస్తోందని అన్నారు. సమ్మెకాలపు ఒప్పంద జిఒలు ఇవ్వకుండా కేవలం ఇంజినీరింగ్ వర్కర్లకు సంబంధించి కొద్ది మొత్తం పెంచుతూ జిఒ జారీ చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రస్తుత ధరలకనుగుణంగా మున్సిపల్ కార్మికులందరికీ జిఒ నంబరు 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్‌చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులందరికీ తల్లికి వందనం, ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు చేయాలని, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. విశ్రాంత అయిన, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ముప్పు తెచ్చే కాంట్రాక్టు విధానాన్ని తీసుకొస్తే తర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హితవుపలికారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ.శంకర్, డి.యుగంధర్, ఎ.శేఖర్, ఎ.మోహన్, గణేష్, ఎన్.తిరుమల, పి.మల్లమ్మ, ఎ.జ్యోతి, ఎ.గణేష్, ఆర్.శేఖర్, ఎ.రాము, దేవి, వెంకటలక్ష్మి, డి.లక్ష్మి, కె.అప్పలకొండ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ పాత బస్టాండ్ వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, కె.వెంకట్, ఎం.రవి, ఎస్.శంకర్, ఎస్.రమేష్, ఎస్.భాస్కరరావు, కూర్మారావు, బాలకృష్ణ, ప్రకాష్ ముఖి, గులాబీ, పార్వతి, నాని శకుంతల పాల్గొన్నారు.

పలాస : ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆమదాలవలస : నిరసన తెలుపున్న పారిశుధ్య కార్మికులు

ఆమదాలవలస : పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తాడి సంతోష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మోణింగి వారి వీధిలో ఉన్న మస్టర్ పాయింట్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌శాఖ ప్రధాన కార్యదర్శి నీలాపు రాజేష్, జె.శ్రీనివాసరావు, కె.తారకేశ్వరరావు, కె.ధనలక్ష్మి, ఎన్.రమ, కె.ఈశ్వరరావు, కె.నీలమ్మ, ఎ.శ్రీనివాస్, డి.రాజేష్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎన్ పురం పెద్ద చెరువులో సర్వే నంబరు 19లో అక్రమంగా మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. మంగళవారం 'ప్రజాశక్తి'లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి చెరువును పరిశీలించారు. అధికారులు చేరే సమయానికి ఎటువంటి వాహనాలు సంఘటన స్థలంలో లేకపోవడంతో తవ్విన ఆనవాలు, ట్రాక్టర్లు ప్రయాణించే రహదారి మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.గోపాలరావు మాట్లాడుతూ అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ దీపిక, మండల సర్వేయర్ శ్రీరామ్మూర్తి, విఆర్ఒ గోపి, మౌనిక పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

పోక్సో చట్టంపై అవగాహన

పొందూరు: పోక్సో చట్టంపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎఎస్ఐ రమణమూర్తిలు అన్నారు. మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఎపి మోడల్ స్కూల్‌లో మంగళవారం ఫోక్సో, యాంటీ నార్కోటెక్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్ బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన, శక్తి యాప్ వినియోగం వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిసిపియు గీత, చైల్డ్ హెల్ప్ లైన్ డి.బి.రాజు, ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుగుణాకరరావు

కోటపాలెంలో గ్రామసభ

రణస్థలం రూరల్: మండలంలోని కోటపాలెం పంచాయతీలో ఎచ్చెర్ల నియోజకవర్గం విజన్ డెవలప్‌మెంట్ ప్లాన్ స్పెషల్ ఆఫీసర్ పి.సుగణాకంరావు ఆధ్వర్యాన పి4 గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో 112 బంగారు కుటుంబాలను గుర్తించారు. వారికి అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. మార్గదర్శకులుగా గ్రామంలో గ్రామ పెద్దలు ఎంపిక చేస్తూ పంచాయతీలో 2029 నాటికి పేదరికం లేని గ్రామంగా, 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా సాధించే దిశగా, పేదరికం లేని గ్రామంగా తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి గోపీబాల, ఎంపిడిఒ ఈశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ వి.ప్రకాష్, సర్పంచ్ గొర్లె జగదీష్‌రావు, కార్యదర్శి శ్రీధర్, మాజీ సర్పంచ్ సుంకరి ధనుంజయరావు పాల్గొన్నారు.

బోధనకే పరిమితం చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయకుండా బోధనకే పరిమితం చేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కొత్తూరు మండలశాఖ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంఇఒలు చందక గోవింద, నిమ్మల శ్రీనివాసరావులను మంగళవారం కలిసి పలు సమస్యలపై చర్చించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్బ క్లస్టర్ పరిధిలో గుడ్లు, చెక్కీలు పాఠశాల పాయింట్‌కు సరైన సమయానికి అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో సమస్యల పరిష్కారానికి ప్రధానోపాధ్యాయులకు సిఆర్‌ఎంటిల సహకారం అందించాలన్నారు. మండలంలో అవసరమైన చోట అదనపు ఉపాధ్యాయులను వర్క్ ఎడ్జిస్ట్‌మెంట్ ద్వారా సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లను అప్‌డేషన్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంటిఎస్ టీచర్ల జీతాలు చెల్లింపు విషయములో క్లస్టర్ హెచ్‌ఎంలతో మాట్లాడాలన్నారు. ఎంఇఒలు స్పందిస్తూ ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంఇఒలను కలిసిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విజయ్‌కుమార్, వి.మధుసూదనరావు, జిల్లా కౌన్సిలర్ ఆర్.ఆర్.ఎం.కొండలరావు, కోశాధికారి బి.భద్రయ్య, సిపిఎస్ కన్వీనర్ టి.రవి, కార్యవర్గ సభ్యులు ఎన్.సంగమేష్, ఎ.శోభనబాబు, టి.గణపతి, పి.దినేష్, పి.ధనుంజయరావు, బి.తిరుపతిరావు, బి.గణేశ్వరరావు, పి.నాగేంద్ర, గౌరీకుమార్, రమణమూర్తి బాలరాజు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగముగా నగర కార్పొరేషన్ పరిధిలోని 31,32,34 వార్డుల్లో మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. శతశాతం అర్హులకు ప్రభుత్వ పథకాలు అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అ న్నారు. నన్ను అభిమానిస్తున్న ప్రజలు, కార్యకర్తల కోసం, నిర్విరామంగా పని చేస్తానని, నన్ను నమ్మి ఎమ్మెల్యే స్థానంలో నిలబెట్టిన ప్రజలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు.

కొత్తూరు : మండలంలోని మదనాపురంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జి.త్రినాథరావు, బర్రి గోవిందరావు, కొప్పల రామకృష్ణ, కర్రెన్న, గజపతి, రాజశేఖర్, సోమేశ్వరరావు, పిండి అప్పన్న పాల్గొన్నారు.

లావేరు : కూటమి పాలనలోనే అభివృద్ధి సంక్షేమం సంమృద్ధిగా అమలవుతుందని లక్ష్మీపురం ఎంపిటిసి మాజీ సభ్యులు బోర పారోతి అన్నారు సుపరిపాలనలో భాగంగా మంగళవారం పంచాయతీలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గాంధీ రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని మేఘవరం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని అగ్రికల్చర్ అసిస్టెంట్ లోళ్ల సుప్రియ, మరువాడ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, దాసురాజు తెలిపారు. రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు మంగళవారం ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన యూరియా, డిఎపి అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరపటి రాజశేఖర్‌రెడ్డి, మేరుగు నూకయ్య, మరువాడ కార్యదర్శి తిరుపతిరావు పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ ప్రయత్నం అభినందనీయం

బహుమతులు అందజేస్తున్న గ్యాస్ యాజమాన్యం

కవిటి: గ్యాస్ వినియోగం - వాడకంపై భారత్ గ్యాస్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెయ్యిల విశ్వనాథం ఉన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చింతామణి భారత్ గ్యాస్ ఆధ్వర్యాన మంగళవారం మన వంటగది - మన బాధ్యత అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం చింతామణి భారత్ గ్యాస్ యజమాని కొండేటి వెంకటరావు మాట్లాడుతూ ఎల్‌పిజి గ్యాస్ వినియోగంపై ప్రతిఒక్క విద్యార్థీ అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ కుటుంబ సభ్యులకు గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చింతామణి గ్యాస్ సిబ్బంది కె.కుర్మారావు, పి.ఈశ్వరరావు, గవ్వల భాగ్యం, బి.శార్వాణి, కృష్ణ, ఉదయ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని 23 వార్డులలో అపారిశుధ్యం రాజ్యమేలుతుంది. గడచిన ఆరు రోజులుగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరసనతో పట్టణంలోని ఏ ప్రాంతం చూసినా ప్రజలు ముక్కు మూసుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి కనిస్తుంది. వర్షాకాలం కావడంతో చిన్నపాటి జల్లులు కురిసిన ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త మరింత కుళ్లి దుర్గంధ భరిత వాసనలు వెదజల్లుతుంది. 23 వార్డులకు సంబంధించి సుమారు 95 మంది పారిశుధ్య కార్మికుల అవసరం ఉంది. రెగ్యులర్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ప్రస్తుతం సుమారు 70 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వారిలో సమ్మె పేరిట సుమారు 50 మంది విధులకు హాజరు కావడం లేదు. దీంతో పట్టణంలో అపారిశుధ్య వాతావరణం ఏర్పడింది. ప్రస్తుతం పది మంది పర్మినెంట్ కార్మికుల మాత్రమే మెయిన్ రోడ్డుపై పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రోజూ పట్నంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకి తరలించడానికి కావాల్సిన వాహనాలు కూడా లేకపోవడంతో చెత్త తరలింపు ప్రధాన సమస్యగా మారింది. గత వారం రోజుల నుంచి ఉన్న 70 మంది పారిశుధ్య కార్మికుల్లో కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న సుమారు 50 మంది రోజూ నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దీంతో పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని చివర ప్రాంతాల పారిశుధ్య నిర్వహణ కష్టతరంగా మారింది. రోజూ ఆయా ప్రాంతాల్లో ప్రజలు వేస్తున్న చెత్తా చెదారంతో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన చెత్త కుండీలు నిండిపోయి బయటి ప్రాంతాలు కూడా చెత్త పూర్తిస్థాయిలో విస్తరిస్తుంది. ముఖ్యంగా రహదారులకు ఇరువైపులా పట్టణ ప్రజలు చెత్త వేయడం ద్వారా వీస్తున్న ఈదురు గాలులకు కుక్కలు చెల్లాచెదురు చేయడంతో రోడ్లపైకి చెత్త చేరి రహదారులన్నీ అధ్వానంగా కనిపిస్తున్నాయి. ఈ దశలో ఉన్న కొద్దిపాటి పారిశుధ్య కార్మికులతో మున్సిపల్ అధికారులు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పర్యవేక్షణ నిర్వహిస్తూ పనులు చేపడుతున్నారని పట్టణ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడం వల్ల ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వార్డులకు చెందిన ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య నిర్వహణ వార్డుల్లో సక్రమంగా చేపట్టి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలు వార్డుల ప్రజలు కోరుతున్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చిరంజీవి

ప్రజాశక్తి - రణస్థలం

శక్తి యాప్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి అన్నారు. రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం శక్తి యాప్, దాని ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు చేస్తున్నాయని, వీటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా మహిళలపై జరుగుతున్న వేధింపులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళా భద్రత, మహిళలపై జరుగుతున్న దాడులు, గృహహింస, శక్తి యాప్ ఉప యోగం వివరించారు. మహిళలు సురక్షిత ప్రయాణం కోసం ఆటోలకు సురక్ష క్యూ ఆర్ కోడ్ యాప్ అందుబాటులోకి తెచ్చామన్నారు.

యువతకు కౌన్సెలింగ్

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చెడు వ్యసనాలకు బానిసైన ఆకతాయి యువకులకు ఎస్ఐ వినూత్నంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. మండల కేంద్రంలోని రామతీర్థం జంక్షన్ వద్ద ఆకతాయిలు సంచరిస్తూ యువకులు కనిపించారు. వెంటనే వారిని పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. శుభ్రమైన దుస్తులు ధరించి, తల చక్కగా దువ్వుకుని, చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. ఏదైనా నేరం చేసి పట్టుబడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జెసి దృష్టికి విఆర్‌ఒల సమస్యలు

జెసిని కలిసిన విఆర్‌ఒల సంఘ నాయకులు

ప్రజాశక్తి - పలాస

విఆర్‌ఒల సమస్యలను పరిష్కరించాలని విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రగడ వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొర్ల శ్రావణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, శ్రీనివాసరావు, విశ్వేశ్వరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణకుమార్‌కు అభినందనలు

ఇటీవల జిల్లాలో నిర్వహించిన విఆర్‌ఒల సంఘం సమావేశంలో పలాస మండలం బ్రాహ్మణతర్ల సచివాలయంలో విఆర్‌ఒగా పనిచేస్తున్న కొర్ల శ్రావణ్‌కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈయనకు విఆర్‌ఒలు అన్ను ప్రసాద్, చంద్రమోహన్, అప్పారావు, కాళిదాసు, వెంకటరమణ, అప్పలనాయుడు, కళ్యాణి, శారద హర్షం వ్యక్తం చేశారు.

'ధారా'ళంగా పోతున్నా పట్టించుకోరా?

వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి - కవిటి

ఓవైపు గుక్కెడు తాగునీటి కోసం ఎంతోమందిచూస్తుంటే, మరోవైపు వరుణుడి కరుణలేక రైతన్న బేల చూపులు చూస్తుంటే కవిటి మండలం కె.కపాసుకుద్దిలో మాత్రం గత మూడు నెలలకు పైగా నీరు వృథాగాపోతోంది. ఉద్దానం తాగునీటి ట్యాంకు ఓవర్ ఫ్లో అవ్వడంతో ట్యాంకులో నీరు మొత్తం పక్కనే ఉన్న తోటలు, కాలువలకుపోతోంది. గ్రామంలోని ట్యాపులు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో నీటి వృథా మరింత ఎక్కువగా ఉంది. దీంతో కళ్లెదుటే ఇంత నీరుపోతుంటే స్థానికులు చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత సిబ్బందికి సమాచారం ఇచ్చినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టి, నీటి సరఫరా సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెప్పినా ఫలితం లేదు

మూడు నెలలకు పైగా నీరు వృథాగా పోతోంది. రోజూ కొన్ని వేల లీటర్లు తోటలోకి, కాలువల్లోకి వెళ్తోంది. చూస్తుంటేనే బాధగా ఉంది. దీనిపై నేనే స్వయంగా సంబంధిత సిబ్బందికి చెప్పినా ఫలితం లేకుండాపోయింది. అది మెగా ప్రాజెక్టుకు సంబంధించినది. ఇక్కడ ఏమీ చేయలేం. వాళ్లే దీనికి పరిష్కారం చూపించాలని చెబుతున్నారు. ప్రస్తుతానికి నీటి సరఫరా పరిస్థితి ఏ మాత్రం బాగులేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వృథా అరికడితే మంచిది.

– చందాన బాలకృష్ణ, కె.కపాసుకుద్ది

IN THE HONORABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
EP. NO.14/2022 IN OS 126/2018.
BETWEEN:
చిత్తిరి భవాని అలియాస్ దన్నాన భవాని ...DHr/ Plaintiff
AND
చిత్తజల్లు విశ్వనాథం ...JDr/ Defendant

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్ లో DHr కు JDr నుండి రావాల్సిన బకాయిని రాబట్టే నిమిత్తం పై నెంబర్ అమలు పిటీషన్ ను దాఖలు చేయగా JDr కు చెంది నటువంటి ఈ క్రింది షెడ్యూల్ దాఖల స్థిరాస్తిని పైకోర్టు వారి ఎదుట తేదీ : 14-08-2025న ఉ॥గం.10-30 ని॥లకు వేలం వేయబడును. వేలంలో పాల్గొనదలచిన వారు సదరు వేలంలో పాల్గొని పాట పాడుకోవచ్చును. సదరు వేలంకు సంబంధించిన వివరములు శ్రీకాకుళం జిల్లా ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఆఫీసులోనూ మరియు DHr గారి తరపున న్యాయవాది గారి ఆఫీసులో గాని లభించును.

షెడ్యూల్ ఆస్తి : శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం SRO, గార మండలం తూలుగు పంచాయితీ, జఫరాబాద్ రెవెన్యూ గ్రామంలో గల మెట్టు భూమి సర్వే నెంబర్ 140/7 లో య.0.78 1/2 మరియు సర్వే నెంబరు 140/8లో య. 1.32 1/2 సెంట్లు వెరసి మొత్తము య. 2.11 సెంట్లు (0.844 హెక్టార్లు), వెరసి ఈ రెండు ప్రతులు కలిసి ఉన్నందున ఈ దిగువ హద్దుల మధ్యస్థంలో ఉన్న ఆస్తికి సరిహద్దులు : తూర్పు: శ్రీరామ అప్పన్న గారి వగైరాలు తాలూకా మెట్టు భూమి, దక్షిణం: దాసరి బొజ్జమ్మ గారి తాలూకా మెట్టు భూమి, పడమర: బెవర రాజులు గారి మెట్టు భూమి, ఉత్తరం: కుట్టుము జగన్నాధం గారి తాలూకా మెట్టు భూమి.

Ameen value : Rs.42,15,000/-.
Market value : Rs.20,26,500/-.
DHR value : Rs. 60,00,000/-

P.V.S.SEETHARAMAYYA
ADVOCATE FOR DHR
H.NO:7-3-1, NEW COLONY SRIKAKULAM
CELL: 9848407726

మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకట ప్రసాద్

పి-4 సర్వే వేగవంతం

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వం చేపట్టిన పి 4 సర్వే వేగవంతం చేయాలని ఎంపిడిఒ వెంకట ప్రసాద్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాల సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారుతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పి 4 సర్వే చేసి ప్రభుత్వ ఆదేశాలు మేరకు బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, శ్రీనివాసరావు, రామారావు, పోలాకి ఎంపిడిఒ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలాస : పి4 సర్వేపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సచివాలయం ఉద్యోగులకు హెచ్చరించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సచివాలయం ఉద్యోగులతో పి4పై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి జిపిఎస్ ద్వారా కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను నిర్ణీత ఫార్మాట్‌లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి ఆ కుటుంబంలో సభ్యులా? కాదా? అనే వివరాలు, ఆ కుటుంబంలోని ప్రతివ్యక్తి పూర్తి వివరాలు ఆన్‌లైన్ ద్వారా చేసి అప్‌లోడ్ చేయాలన్నారు.

'అనమిత్ర హిల్స్' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఎస్.ఎం.పురం రోడ్డులోని ట్రిపుల్ ఐటి కళాశాల వెనుక ఉన్న అనమిత్ర టౌన్ షిప్ ఇకపై అనమిత్ర హిల్స్‌గా మార్పు చేశారు. ఈ సందర్భంగా అనమిత్ర హిల్స్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కె.ఎం.వి.ప్రసాదరావు, ఉపాధ్యక్షునిగా కుప్పిలి లక్ష్మణరావు, కార్యదర్శిగా బస్వ జగదీష్, సంయుక్త కార్యదర్శిగా సిహెచ్.రవిబాబు, కోశాధికారిగా బెండి వి.శ్రీనివాసరావు, సభ్యులుగా పి.కృష్ణకుమారి, సిహెచ్.త్రివేణి, ఎం.పుణ్యవతి, బి.జగన్మోహనరావు, జాకబ్, జి.లక్ష్మీనారాయణలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కాలనీ అభివృద్ధి లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కాలనీ పరిరక్షణ, నిర్వహణ పనుల పర్యవేక్షణకు పి.నాగరాజును కేర్‌టేకర్‌గా నియమించారు.

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

ఆధునిక బోధనా పద్ధతులు అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రస్తుత పరిస్థితుల్లో బోధనలో ఆధునిక పద్ధతులు అవసరమని శ్రీకాకుళం పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు అన్నారు. కళాశాలలో డిబిటి ఆధ్వర్యాన ఈ నెల 24న నిర్వహించనున్న బోధనా పద్ధతుల్లో మార్పులు అంశంపై లెక్చర్ సిరీస్ మంగళవారం నిర్వహించి బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్లైడ్ సైన్సెస్ విభాగం ఈ లెక్చర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐఐటి చెన్నైకి చెందిన ప్రొఫెసర్ రాయల సురేష్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందన ప్రొఫెసర్ పొదిల అప్పారావు పాల్గొని మాట్లాడారు. సైన్స్ కోర్సుల్లో మార్పులు, విద్యార్థుల నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానానికి దోహదపడే బోధన పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో అప్లైడ్ సైన్సెస్ విభాగాధిపతి మధమంచి ప్రదీప్ పాల్గొన్నారు.

విప్‌ని సన్మానిస్తున్న రామారావు

ఆలయ అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పెద్దశ్రీరాంపురం పంచాయతీ రామలింగేశ్వర స్వామి ఆలయం పునరుద్ధరణ పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు టిడిపి కంచిలి మండల అధ్యక్షుడు మాదిన రామారావు తెలిపారు. ఈ మేరకు ఆయనతోపాటు గ్రామ పెద్దలు స్థానిక ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను మంగళవారం కలిసి సన్మానించారు. ఈ మాట్లాడుతూ గ్రామంలోని పురాతన ఆలయ పునరుద్ధరణకు సర్వశ్రేయో నిధి నుంచి రూ.80 లక్షలు, రామలింగేశ్వర ఆలయ కమిటీ మాచింగ్ గ్రాంట్ ద్వారా రూ.20 లక్షలు కేటాయించారని తెలిపారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన విప్‌కు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లమ్మ పంచాయతీ మహాసింగిలో లక్ష్మీనరసింహ ఆలయానికి వెళ్లే సిమెంట్ రోడ్డు దేవాదాయ, ధర్మాదాయశాఖ రూ.30 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి పనులు పూర్తయితే యాత్రికులు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, లోతుగెడ్డ భగవాన్ దాస్‌నాయుడు, లోతుగెడ్డ ఇందిరామ్, పడాల వెంకటకృష్ణ, లోతుగెడ్డ పవన్, దారపు కాశీబాబు పాల్గొన్నారు.

హామీల అమల్లో విఫలం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలైమందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 2 వార్డుల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలతో కూడిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, మున్సిపల్ అధ్యక్షులు కాళ్ల సత్యం, కౌన్సిలర్లు సిగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల పుష్ప, అన్వేష్ పాల్గొన్నారు.

నరసన్నపేట : చంద్రబాబును గెలిపించి ప్రజలు ఓడిపోయారని, ఇప్పుడిప్పుడే తామంతా మోసపోయామని బాధపడుతున్నారని పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని పారశెల్లి, తెలగవలస, చెన్నాపురం పంచాయతీల్లో మంగళవారం బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి, వైసిపి పాలనపై పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆర్.అంజిమురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, సర్పంచ్‌లు ఆడంగి సూర్యనారాయణ, కొంక్యాన నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పోస్టర్లను అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

రణస్థలం : మండలంలోని జీరుపాలెంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, యువజన విభాగం సంయుక్త రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, బిసి సెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, ఎచ్చెర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దన్నాన హరి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు నేతల కృష్ణ, సర్పంచ్ ప్రతినిధి మాగుపల్లి రాము పాల్గొన్నారు.

నందిగాం : అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీకాంత్‌వర్మ

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- కవిటి

రసాయన ఎరువుల వాడకంలో భాగంగ రైతులు యూరియా మోతాదును తగ్గించుకోవాలని ఎఒ పిరియా శ్రీదేవి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పుక్కళ్లపాలెం, కవిటి గ్రామాల్లో మంగళవారం వరి పొలాల్లో నాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా స్థానంలో ఎన్‌పికె కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల మోతాదును సమర్థవంతంగా తగ్గించవచ్చని వివరించారు. వీటిని రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పంటలకు అవసరమైన సమతుల్య పోషకాలందిస్తేనే దిగుబడులు మెరుగవుతాయని అన్నారు. వాటిని ఏయే సమయాల్లో ఎంత మోతాదుల్లో వేయాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బెందాళం శ్రీకళ్యాణ్, ఎపిఎంఐపి ప్రతినిధి శరణ్య, విఎఎ మౌనిక, ఎంపిఇఒ లలిత, రైతులు బెందాళం రమేష్, గార గిరి, బెందాళం అబ్బాయి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పొలం పిలుస్తోందిలో భాగంగా ధర్మాపురంలో ఎఒ అజయ్‌కుమార్ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు.

కోటబొమ్మాళి: మండలం అక్కయ్యవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎఒ ఎస్.గోవిందరావు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు యూరియా, డిఎపి ఎరువులను పంపిణీ చేశారు. రైతులకు వరి సాగులో కలుపు నివారణ అదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ బి.అరుణ, విఎఎ సాయికిరణ్ పాల్గొన్నారు.

సోంపేట : గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు భవానీశంకర్ కోరారు. మండలంలోని నూకలూరు, పాలవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎఒ బి.నరసింహమూర్తితో కలిసి నిర్వహించారు. వరి నారుమళ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రదీప్, రైతులు నూకల పున్నయ్య, శంకర్, కృష్ణారావు, మోహనరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నందిగాం : రైతులు యంత్రాలను వినియోగించడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చునని ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మండలంలోని హర్షబాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, సస్యరక్షణ ఒంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయం చేద్దాం

పలాస : ప్రకృతి వ్యసాయం చేసి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపిఎం) పూజారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని టెక్కలిపట్నం పంచాయతీ మోదుగలపుట్టిలో అవుగాన తిరుపతిరావు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యసాయ సహాజవనరుల కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలో తయారీ చేసిన ద్రవజీవామృతం, నేమాస్త్రం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపత్రి ద్రావణం, తూటికాడ కషాయాల తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎంటి సూర్యనారాయణ, ఎస్.నాగరాజు, నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షులు అవుగాన షణ్ముఖరావు, ఐసిఆర్‌పిఎస్ పాపారావు, కూర్మారావు, వెంకటలక్ష్మి మెంటర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

కవిటి: సేంద్రీయ సాగు ద్వారా భూమిలో సూక్ష్మ పోషకాలు పెరిగి, మంచి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు లభిస్తాయని డిఎంఎంటి తులసయ్య తెలిపారు. మండలంలోని పాతశిలగాంలో సేంద్రీయ విధానంలో ఎటిఎం మోడల్‌లో సాగుపై అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన పోకల దివ్య 0.15 సెంట్ల భూమిలో ఈ మోడల్‌ను ఏర్పాటు చేసి ఘన జీవామృతం వేసి, భీజామృతంతో శుద్ధి చేసిన 20 రకాల విత్తనాలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయట నుంచి కొనుగోలు చేసే ఆకుకూరలు, కూరగాయల్లో ఉన్న రసాయనాలు, పురుగుమందుల వల్ల శరీరంపై దుష్ప్రభావాలు ఉంటాయని హెచ్చరించారు. శరీరంలో వ్యాధినిరోధక శక్తి తగ్గి, షుగర్, బిపి, కేన్సర్ వంటి వ్యాధులు రావచ్చని వివరించారు. సేంద్రీయ విధానంలో సాగుచేసిన కూరగాయలతో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని, ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని ప్రతి మహిళా సభ్యులు ఎటిఎం మోడల్ వేసుకొని ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. ఐసిఆర్‌పి సభ్యులు సంతోషి, జయ, మహిళా సంఘ సభ్యులుపాల్గొన్నారు.

ఆమదాలవలస : వరి పంటలో మంచి దిగుబడులు, నాణ్యమైన పంట ఉత్పత్తి రావాలంటే సస్యరక్షణ పద్ధతులను పాటించాలని ప్రకృతి వ్యవసాయ సిడిఎఫ్ చేపేన సురేష్ అన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యన్నారాయణ ఆదేశాల మేరకు చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో వరి పంటలో లైన్‌షోయింగ్ విధానాలను రైతులతో మంగళవారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పద్ధతిని రెండేళ్ల క్రితం నుంచి రైతులకు అలవాటు చేయించామని తెలిపారు.

బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నేర నియంత్రణ చర్యల్లో భాగంగా టెక్కలి ఎస్ఐ ఎం.విజయ కుమార్ ఆధ్వర్యాన పోలీసులు మంగళవారం ఉదయం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు నిర్వహించి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు పలు వార్డు, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. గ్రామాల శివారు ప్రాంతాల్లో సోదాలు చేసి అక్రమ మద్యం, గంజాయి, నిల్వలపై ఆరా తీశారు. పాత నేరస్థులు, ట్రబుల్ మాంగర్స్, కొత్త, అనుమానిత, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. వారి జీవన విధానం, వృత్తి విధానంపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో ఏటువంటి, సరైన వాహన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొత్త వ్యక్తులు సమాచారాన్ని తెలపాలని సూచించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టి,నేర నియంత్రణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

లావేరు ఫీల్డ్ అసిస్టెంట్‌గా సూరప్పడు

లావేరు : లావేరు పంచాయతీ ఉపాధి హామీ ఇన్‌ఛార్జీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా సిగురికొత్తపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ గిడుతురి సూరప్పడును నియమించినట్లు ఎపిఒ రెడ్డి సత్యవతి మంగళవారం తెలిపారు. ఇటీవల 18వ విడత సామాజిక తనిఖీలో లావేరు ఫీల్డ్ అసిస్టెంట్ పి.రాము ఏడాదిగా విధులకు డుమ్మాకొట్టినట్లు తద్వారా పంచాయతీలో ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు చోటుచేసుకోవడంతో సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తిరంగా ర్యాలీ

శ్రీకాకుళం సిటీ: నగరంలోని అరసవల్లి రోడ్డు ఉన్న శర్వాణి విద్యాలయ ఆధ్వర్యాన మంగళవారం జాతీయ పతాక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులు వంద అడుగుల జాతీయ పతాకంతో పాఠశాల నుంచి తెలుగుముసలయ్య కాలనీలోని మున్సిపల్ పార్క్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతమాతాకి జై... వందేమాతరం... పింగళి వెంకయ్య అమర్ రహే... అంటూ నినాదాలు మిన్నంటాయి. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యగారి సేవలను గుర్తుచేసుకున్నారు. ఇంగ్లీషు హెచ్‌ఒడి కె.రవిరాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు దేశంపై ప్రేమ ఉండాలన్నారు. జాతీయ పతాకం, జాతీయ గీతంపై గౌరవభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పిఇటి శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని దేవాదికి చెందిన బండి కృష్ణ, స్వాతి దంపతులకు మోహిని, యోగిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి స్వాతి కేన్సర్‌తో, తండ్రి కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం వెంటనే స్పందించింది. పలువురు దాతల ద్వారా సేకరించిన రూ.50 వేలు మంగళవారం చిన్నారులకు అందజేశారు. ఇద్దరు పిల్లల పేరున ఫిక్సిడ్ డిపోజిట్ చేయమని గ్రామ సర్పంచ్ ఎం.రాముని కోరామని అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. చిన్నారులకు ప్రతిఒక్కరూ సామాజిక స్పృహతో ముందుకొచ్చి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎన్.సింహాచలం, ధర్మవపు పూర్ణాచారి, పిల్లల రమేష్, ఉంగరాల గోవిందరావు పాల్గొన్నారు.

నరసన్నపేట : ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

కోటబొమ్మాళి: మండలంలోని విశ్వనాథపురానికి చెందిన చిగురువలస సింహాచలం, అనురాధ దంపతుల కుమారుడు రంజిత్ తల సేమియా అనే వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు రూ.5 వేలు జిల్లా నాయీబ్రాహ్మణ అధ్యక్షులు కుప్పిలి వెంకటరావు ఆధ్వర్యాన ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. టిడిపి సీనియర్ నాయకులు నౌగాపు నాగరాజు, సిహెచ్.కనకరాజు, అప్పలస్వామి, వీరస్వామి, హరీష్, తెలుగువలస మోహనరావు, శంకర్ పోతల రామదాసు, అప్పారావు, బొమ్మలి కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో విలీనం చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

ప్రజాశక్తి- పలాస

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసి నేరుగా జీతాలు చెల్లించాలని కోరారు. పలాస విద్యుత్ శాఖ కార్యాలయంలో డివిజన్ షిఫ్ట్ ఆపరేటర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డివిజన్ అధ్యక్ష, కార్యదర్సులు కె.గిరీశ్వరరావు, గార రాజారావులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షిఫ్ట్ ఆపరేటర్లు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగా విధుల్లోకి చేరిన షిఫ్ట్ ఆపరేటర్లకు, పాత షిఫ్ట్ ఆపరేటర్లకు జీతభత్యాలు ఇప్పించాలని కోరారు. 2022 పిఆర్‌సి ఏరియర్స్ ఇప్పించాలని విన్నవించారు. ఏడాదికి 15 రోజులు సెలవు దినాలు ఇవ్వాలన్నారు.

వ్యక్తి అరెస్టు

లావేరు : మండలంలోని బెజ్జపురంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వి. రామారావును టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారని హెచ్‌సి జోగారావు తెలిపారు. ఆయన వద్ద నుంచి 91 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రామారావును అరెస్టు చేసి ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

చదరంగం పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

టెక్కలి: శ్రీకాకుళం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్స్ చదరంగం పోటీల్లో బాలబాలికల విభాగంలో టెక్కలి నుంచి ఐదుగురు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారని చదరంగం అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి సనపల భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో అండర్-8 విభాగంలో టెక్కలికి చెందిన సనపల రిత్విక్‌సాయి, బొరిగి అద్విక్ రాష్ట్రస్థాయిలో వెయిటేజీ పాయింట్లు సాధించారు. అండర్-10 విభాగంలో జిష్ణు, కె.రుత్విక వెయిటేజీ పాయింట్లు సాధించారు. అండర్-12 విభాగంలో బొరిగి అభిరామ్ వెయిటేజీ పాయింట్లు మొట్టమొదటిసారిగా టెక్కలి క్రీడాకారులు సాధించారని తెలిపారు. వీరికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారన్నారు. వీరందరికీ టెక్కలిలోని చెస్ అకాడమీలో అభినందించారు.

సన్మానిస్తున్న ఉద్యోగులు

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని కోష్ట పంచాయతీ సచివాలయంలో బదిలీపై వెళ్లిన ఉద్యోగులను కార్యదర్శి వి.చంద్రశేఖర్ ఆధ్వర్యాన గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. ఐదేళ్లపాటు పంచాయతీలో విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీల్లో వేర్వేరు పంచాయతీలకు వెళ్లారు. కార్యదర్శి ఆర్.శ్రీధర్, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజినాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము నాయుడు, సర్వేయరు ఈశ్వరరావులను జ్ఞాపిక, పుష్పగుచ్ఛం, శాలువతో సత్కరించారు. అనంతరం కొత్తగా వచ్చిన ఉద్యోగులకు స్వాగతం పలికి ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ గోపీబాల, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ ప్రకాశరావు పాల్గొని ఉద్యోగులకు శుభాకాంక్షలు అందజేశారు. టిడిపి నాయకులు పి.జగన్నాథం నాయుడు, ఎంపిటిసి పి.అసిరినాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు పి.అప్పడుదొర, పి.హరికృష్ణ, విఆర్‌ఒ అప్పలనాయుడు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం

అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలను నమోదు చేసుకోవాలని, తద్వారా ధీమాగా ఉండాలని రణస్థలంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీలో సురక్ష బీమా యోజనపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన దన్నాన సూర్యనారాయణ కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ ముఖ్య అధికారి పైడి రాజా, మేనేజర్ గౌతమ్ పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

సోంపేట: మండలంలోని కొర్లాంలోని ప్రైవేటు ఎరువుల షాపులను వ్యవసాయ సహాయసంచాలకులు టి.భవానీశంకర్, ఎఒ బి.నరసింహమూర్తిలు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా షాపుల్లోని నిల్వలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎరువుల ప్రభుత్వ నిబంధనల మేరకు అమ్మకాలు చేపట్టాలని సూచించారు.

డ్రైనేజీతో అవస్థలు

టెక్కలి రూరల్ : మేజర్ పంచాయతీ మండపొలం కాలనీ డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చినుకుపడితే నీరు వెళ్లేందుకు సరైన కాలువల్లేక రోడ్లపైనే మురుగు నిలిచిపోతోంది. దీంతో రాత్రి వేళల్లో పాములతో స్థానికులు భయపడుతున్నారు. మురుగు నీరు నిలిచపోవడంతో వ్యాధుల బారినపడతామని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు స్కూళ్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో కాలువలు, రహదారులు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అవస్థలు పడుతున్న విద్యార్థులు